క్లుప్తంగా

ఇంటి నిర్మాణ పనులు వేగవంతం

విజయపురం: గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ఏలుమలై ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ఇంటి నిర్మాణ పనులు తిరిగి కట్టుకోవాలని, వాటికి సంబంధించిన నిధులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణం చేస్తున్న వారు తమ వద్దకు వస్తే బిల్లు ఇస్తామని తెలిపారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం


గుండ్లకట్టమంచి దళితవాడ ప్రజలతో మాట్లాడుతున్న ఏడీ కొండయ్య

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి దళితవాడలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని ట్రాన్స్‌కో ఏడీ కొండయ్య తెలిపారు. గుండ్లకట్టమంచి దళితవాడ ప్రజలు విద్యుత్ సమస్యపై శనివారం రాత్రి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఏడీ ఆదివారం దళితవాడలోని ఇళ్లను సందర్శించారు. గ్రామస్తులు భూమిలో ఎర్తింగ్ సక్రమంగా లేకపోవడం వల్ల ఇళ్లల్లో వస్తువులకు విద్యుత్ సరఫరా అవుతోందన్నారు. దీంతో విద్యుత్ షాక్‌కు గురవుతున్నట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీ రాత్రి విద్యుత్ షాక్ కారణంగా గ్రామానికి చెందిన నాగయ్య, అతని మనవడు రాజ్‌కుమార్ మృతి చెందారన్నారని గ్రామస్తులు ఏడీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ, సమస్యను పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నాగయ్య, రాజ్‌కుమార్‌కు విద్యుత్‌శాఖ తరఫున అందాల్సిన పరిహారాన్ని అందించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఆలోచనా విధానాన్ని బట్టే జీవితం


హాజరైన ధ్యానులు


తవణంపల్లె: ఆలోచనా విధానాన్ని బట్టే మన జీవితం ఆధారపడి ఉంటుందని తిరుపతికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ లక్ష్మీప్రసూన పేర్కొన్నారు. కాణిపాకం సమీపంలోని శ్రీవిఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఆదివారం మూడు రోజుల ఆత్మజ్ఞాన, ఆరోగ్య శిక్షణా శిబిరంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఎప్పుడూ వర్తమానంలో జీవించాలన్నారు. గతాన్ని ఆలోచించుకుంటూ కూర్చుంటే వర్తమానంలో ఏమీ చేయలేమని, తద్వారా భవిష్యత్ పూర్తిగా దెబ్బతింటుందని చెప్పారు. మానవుడు మాధవుడిగా ఎదగడానికి ధ్యానం దోహదపడుతుందన్నారు. అనంతరం జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక ఆమెను శాలువాతో సత్కరించారు.

వైభవంగా అర్జున తపస్సు


తవణంపల్లెలో తపస్సుమానును అధిరోహిస్తున్న అర్జునుడు

తవణంపల్లె: మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో ఆదివారం సాయంత్రం అర్జున తపస్సు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకులసహదేవుల విగ్రహాలకు అభిషేకం, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి తపస్సు మాను దగ్గర ఉంచారు. కళాకారుడు మణి అర్జున వేషధారణ ధరించి తమిళంలో పద్యాలు పాడుతూ తపస్సుమానును అధిరోహించారు. తపస్సుమాను దగ్గర సంతానం లేని మహిళలు భక్తితో తడిబట్టలతో వరపడ్డారు. అర్జునుడు తపస్సుమానుపైనుంచి భక్తులకు వీబూది, నిమ్మపండ్లు, బిల్వ ఆకులు, బొరుగులు చల్లగా పోటీపడి పట్టుకొన్నారు. అనంతరం ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలను ఊరేగించారు.

బంగారుపాళెంలో వర్షం



బంగారుపాళెం: మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. సాయంత్రం ఉన్నపలంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని జోరుగా వర్షం కురిసింది. వర్షపు నీరు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మకిలి పట్టిన ప్రైవేట్ వైద్యం


49 కొత్తపల్లిమిట్టలో డాక్టర్ అన్వేష్ ఎంబీబీఎస్,ఎఫ్ఏ ఎమ్ఎస్ (సివిల్ సర్జన్) డాక్టర్ పేరిట వెలసిన నకిలీ బోర్డు

వారికి విద్యార్హతలు ఏమీ ఉండవు.. అయినా సరే తెల్లకోటు తొడుక్కుని వైద్యం చేస్తారు.. పదో తరగతి మధ్యలో ఆపేసినోళ్లు ఆర్ఎంపీ, పీఎంపీలుగా చలామణి అవుతుంటే.. వారి దగ్గరకు డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ చదివినోళ్లు వైద్యం కోసం వెళ్తుండడం సిగ్గు పడాల్సిన విషయం. కనీసం వైద్యం చేస్తున్న ఏం చదివాడో కూడా తెలుసుకోలేని స్థితిలో జనం ఉన్నారు. ఇదే అవకాశంగా భావిస్తున్న నకిలీ డాక్టర్లు కూడా ఏ రోగంతో వెళ్లినా.. యాంటీ బయాటిక్ వేయడం, ప్యారాసిట్మాల్, దోలో ఇలా అన్ని రకాలకూ ఒకటే వైద్యం చేసి దబ్బులు గుంజుతున్నారు. ఇంతటితో ఆగని కొందరు ఆర్ఎంపీలు ఆపరేషన్లు సైతం చేస్తున్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ఏకంగా సర్జన్లు అంటూ బోర్డులు వేసుకుని యథేచ్ఛగా క్లినిక్‌లు నడుపుతూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

- గల్లీకో నకిలీ డాక్టర్
- పదో తరగతి మధ్యలో ఆపేసినోళ్లే ఆర్ఎంపీలు, పీఎంపీలు
- అమాయకులు, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ చదివిన వారికి వైద్యం చేస్తున్న వైనం
- ఆపై స్పెషల్ సర్జన్లుగా బోర్డులు ఏర్పాటు చేసుకుని మరీ చలామణి
- అధిక మోతాదులో ఇంజక్షన్లు, యాంటీబయాటిక్‌లు వేస్తున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


జాతీయ రహదారి పక్కనే పారబోసిన సిరంజి, సూదులు, మందుల సీసాలు

శ్రీరంగరాజపురం: నగరాల్లోని పెద్దాస్పత్రికి వెళ్తే ఖర్చులు భరించలేమన్న కారణంతో పేద జనం ఆర్ఎంపీలు, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి గ్రామంలో ఓ క్లినిక్ వెలుస్తోంది. అందులో ఆర్ఎంపీలు వైద్యం చేయడంతో పాటు అనుమతులు లేకుండా ల్యాబ్‌లు, మెడికల్ షాప్‌లు కూడా నిర్వహిస్తున్నారు. ఇష్టానుసారంగా రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. మరికొందరు అయితే మెడికల్ దుకాణాల్లోనే ఏకంగా అన్ని రకాల చికిత్సలు చేస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ నిబంధనలు ఇలా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. ఎలాంటి ఇంజెక్షన్లు ఇవ్వకూడదు. ఎవరైనా జర్వంతో బాధపడుతూ వస్తే సాధారణ మాత్రలు ఇవ్వాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సిఫార్సు చేయాలి. కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు తమ పరిధి దాటి చికిత్స చేస్తున్నారు. ప్రతి రోగానికి అధిక మోతాదులో ఇంజెక్షన్ ఇచ్చేస్తున్నారు. ఎక్కువ మోతాదులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటివి వేస్తున్నారు. వీటి వల్ల మనిషి రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. గర్భిణులు, చిన్న పిల్లలకు అసలు ఎలాంటి చికిత్స చేయకూడదు. కొందరు ఫార్మసీ సర్టిఫికెట్ దగ్గర ఉంచుకుని మందుల దుకాణాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి.

స్టెరాయిడ్‌లతో ప్రాణాలకే ప్రమాదం..

కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు వేసే ఇంజక్షన్లు వికటించి రోగులు ప్రాణాలే పోతున్నాయి. వ్యాధి త్వరగా తగ్గిపోవాలన్న కారణంతో అధిక మోతాదులో స్టెరాయిడ్స్ ఇస్తున్నారు. ఫలితంగా ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలు, శరీరం అంతా దద్దుర్లు రావడం వంటి లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. పరిస్థితి అదుపులోకి రాక కొంతమంది రోగులు కోమాలోకి వెళ్తున్నారు. మరికొందరు చనిపోతున్నారు. శ్రీరంగరాజపురం మండలంలో సీకే పురం గ్రామానికి చెందిన చిన్నారి ప్రీతి (5)కి జ్వరం, జలుబు ఉండడంతో తల్లిదండ్రులు గ్రామానికి సమీపంలోని తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టులోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తీసుకెళ్లారు. అక్కడ అధిక మోతాదులో ఇంజక్షన్ వేయడంతో అది వికటించి చిన్నారి మృతి చెందింది. అలాగే గంగాధరనెల్లూరు మండలానికి చెందిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ మండల కేంద్రంలో ఉన్న అనధికారంగా నడుస్తున్న ఓ ప్రైవేటు మెడికల్ షాపు వద్దకు చికిత్స కోసం వెళ్లడంతో క్లినిక్ నిర్వాహకుడు ఏవ్యాధి అని గుర్తించకుండా ఇంజక్షన్ వేశాడు. దీంతో ఆ వృద్ధుడు క్లినిక్‌లోనే మరణించాడు. విషయం తెలుసుకున్న అధికారులు క్లినిక్‌ను సీజ్ చేశారు.

రోగం ఏదైనా చికిత్స ఒకటే..

కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలతో పాటు వారి వద్ద పని చేసే అటెండర్లు సైతం రోగులకు చికిత్స చేస్తున్నారు. శ్రీరంగరాజపురం 49 కొత్తపల్లిమిట్ట తిరుపతి రోడ్డులో ఒక అటెండర్ భరణి క్లినిక్ పేరుతో డాక్టర్ అన్వేష్ ఎంబీబీఎస్, ఎఫ్ఏ, ఎంఎస్ (సివిల్ సర్జన్)పభుత్వ డాక్టర్ అని పెట్టుకుని చెలామణి అవుతున్నాడు. వచ్చిన రోగులకు అన్ని రకాల టెస్ట్‌లు, మాత్రలు, ఇంజెక్షన్లు వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రథమ చికిత్స అందించాల్సిన వీరు ఏకంగా ప్రత్యేక భవనాల్లో పడకలు ఏర్పాటు చేసుకుని వైద్యం అందిస్తున్నారు. భారీ ఫ్లెక్సీలు, పెద్దపెద్ద హోర్డింగులు ఏర్పాటు చేసుకుని క్లినిక్‌లు నడుపుతున్నారు. కొన్నిచోట్ల క్లినిక్‌తో పాటు మందుల దుకాణాలు కూడా ఒకేచోట నిర్వహిస్తున్నారు. తక్కువ డబ్బుతో వైద్యం చేస్తున్నారనే కారణంతో రోగులు వారి క్లినిక్‌లకు క్యూ కడుతున్నారు. ఇదే అదునుగా వీరు జేబులు నింపుకునే పనిలో పడ్డారు.

నరకాన్ని తలపిస్తున్న వైద్యం

పుంగనూరు నక్కబండ దళితవాడకు చెందిన బాలి, వీణా దంపతుల కుమారుడు సాత్విక్ (10 నెలలు)కు దగ్గు, జ్వరం ఉండడంతో కార్తిక్ చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స చేయించారు. డబ్బులు వేలకు వేలు గుంజుకుని పసికందు చనిపోయి గంటలు గడిచినా చికిత్స అందించినట్లు నటించి, చివరకు బిడ్డను త్వరగా మదనపల్లె ఆస్పత్రికి తీసుకెళ్లండి లేకుంటే ప్రమాదం అని నమ్మబలికి నరకాన్ని తలపించేలా చికిత్స అందించారు. ఈ విధంగా జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇలాంటి నకిలీ వైద్యుల ఆగడాలు వెలుగు చూస్తున్నా, అధికారుల్లో ఏమాత్రం చలనం ఉండడం లేదు.

చర్యలు తీసుకుంటాం



ఆర్ఎంపీ, పీఎంపీలు ఇష్టానుసారంగా వైద్యం చేయకూడదు. ప్రథమ చికిత్స వరకు మాత్రమే పరిమితం కావాలి. ఇంజెక్షన్లు వేయడం, సెలైన్లు పెట్టడం, ఆపరేషన్లు చేయడం లాంటివి చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయి. ప్రజలు ప్రభుత్వాస్పత్రుల్లో అందుతున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి. ఆర్ఎంపీలపై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం.
– డాక్టర్ ప్రభావతి, చిత్తూరు జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ

నంది అవార్డు గ్రహీతకు ఘన సన్మానం


చక్రధర సిద్ధాంతిని సత్కరిస్తున్న విజయసుబ్రహ్మణ్యం సిద్ధాంతి

వెదురుకుప్పం: ప్రముఖ జ్యోతిష్యుడు, రాష్ట్ర నంది అవార్డు గ్రహీత చక్రధర సిద్ధాంతిని శ్రీకాళహస్తి ఆలయ ప్రధాన అర్చకులు, కంచి కామకోటి పీఠం ఆస్థాన సిద్ధాంతి విజయసుబ్రహ్మణ్య సిద్ధాంతి ఘనంగా సత్కరించారు. తిరుపతిలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ జ్యోతిష్య సమ్మేళనం సందర్భంగా సత్కరించారు. సన్మానంతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా విజయసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చక్రధర సిద్ధాంతి జ్యోతిష్య శాస్త్రంలో చేస్తున్న కృషికి తగిన గుర్తింపు దైవాజ్ఞరత్న పురస్కారం జరిగిందని భవిష్యత్‌లో మరెన్నో సత్కారాలతో జ్యోతిష్య శాస్త్రంలో తిరుగులేని సిద్ధాంతిగా ఎదగాలని ఆకాంక్షించారు.

వాయు, శబ్ద కాలుష్యాలను అరికట్టాలి

చిత్తూరు కలెక్టరేట్: వాయు, శబ్ద కాలుష్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నం చేయాలని వైద్యులు భరత్‌రెడ్డి, జయంత్ అన్నారు. ఈ మేరకు చిత్తూరు నగరంలోని సైక్లిస్టులు ప్రపంచ కార్ ఫ్రీ డేను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు నగరంలోని గాంధీ విగ్రహం నుంచి దర్గా సర్కిల్, గిరింపేట, కొంగారెడ్డిపల్లి, సంతపేట ప్రాంతాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిత్యం కారు, ద్విచక్ర వాహనాలనే వినియోగించకుండా సైకిల్‌ను వినియోగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. వాయు, శబ్ద కాలుష్యాలను తగ్గించడం కోసం చేపట్టాల్సిన అంశాలపై అవగాహన పెంచేందుకు ప్రతి ఏటా కార్ ఫ్రీ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, వినోద్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగు జాగ్రత్తలతో చెరుకు తీపి


చెరుకు పంట

విజయపురం: వాణిజ్య పంటల్లో రారాజుగా పేరొందిన చెరుకు పంట సాగులో చీడపీడలను అరికడితే అధిక దిగుబడులు పొందవచ్చు. ఏడాది వ్యవధి గల ఈ పంటను పలు రకాలైన పురుగుల దాడి నుంచి కాపాడాలని అధికారులు సూచిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా చెరుకు పంటను సాగు చేస్తున్నారు. చిన్న చిన్న చిట్కాలు, జాగ్రత్తలు తీసుకుంటే చెరుకులో మంచి దిగుబడి వస్తుంది. ప్రధానంగా పంటను దిగుబడులు, నాణ్యతను ప్రభావితం చేసే పురుగుల్లో పీకపురుగు, కాండ తొలిచే పురుగు, దూదేకుల పురుగు, వేరు లద్దెపురుగు, చెదపురుగు, పిండినల్లి, తెల్లపేను, పసుపు నల్లి పురుగులు ప్రధానమైనవిగా చెబుతున్నారు.

విత్తన శుద్ధి

నాటడానికి ముందు చెరుకు ముచ్చెలను ఒక లీటరు నీటిలో మలాథియాన్ 2 మిల్లీలీటర్లు, డైమిథోయేట్1.7 మిల్లీలీటర్లు చొప్పున కలిపిన ద్రావణంలో 15 నిమిషాలు ముంచాలి. ఈ విధానంతో పొలుపు పురుగు, దూదేకుల పురుగు, వేరు లద్దెపురుగు, ఎర్రనల్లి పురుగు, తెల్లపేను, పసుపు నల్లి పురుగులు పంటను ఆశించవు. విత్తన శుద్ధి ద్వారా పంట దిగుబడిని పెంచుకోవచ్చు.

యాజమాన్య పద్ధతులు

ముచ్చెలను లోతైన సాళ్లలో నాటుకోవాలి. మొక్క మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలి. నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త పడాలి. పొలుసు పురుగు, తెల్లపేను, పిండి నల్లి ఆశించిన తోటల నుంచి విత్తనాలు సేకరించరాదు. అధికారుల సూచన మేరకు, లేదా అనుభవం కలిగిన రైతుల సలహా మేరకు విత్తనం కొనుగోలు చేయాలి. పొలం చుట్టూ ఉన్న తుమ్మ, వేప చెట్లపై మోనోక్రోటోఫాస్, కార్బరిల్ మందులు పిచికారీ చేయాలి. నాటే సమయంలో ఎకరానికి 8–10 కిలోల చొప్పున ఫోరేట్ గుళికలను భూమిలో వేసుకోవాలి.

వేరు లద్దెపురుగు

ఈ పురుగు సి–ఆకారంలో తెల్లగా ఉంటాయి. కార్శి తోటల్లోనూ, తేలిక నేలల్లో వీటి ఉధృతి ఎక్కువ. జూలై నుంచి సెప్టెంబర్ నెలల్లో దీని ఉధృతి ఎక్కువ. ఎదిగిన తోటల్లో వీటి నివారణకు ఎకరానికి 8 కిలోల ఫోరేట్, 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను మొక్కల మొదళ్ల దగ్గర గుంతలు తీసి వేయాలి.

దూదేకుల పురుగు

ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన గుంపులు గుంపులుగా చేరి ఆకుల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఈ పురుగు ఎక్కుగా సెప్టెంబర్ నెలలో చెరుకుని ఆశిస్తుంది. లీటరు నీటిలో మలాథియాన్ 2 మిల్లీలీటర్లు కలిపిన ద్రావణాన్ని ఆకుల అడుగు భాగం బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

పసుపు నల్లి

ఆకుల అడుగు భాగాన ఈ పురుగులు గుంపులుగా 6–8 వరుసలలో ఆకు మధ్య ఈనెకు సమాంతరంగా తెల్లటి గూళ్లను చేసి వాటి లోపలి నుంచి రసాన్ని గీకి పీల్చుతాయి. దీంతో ఆకులపై పసుపు పచ్చని అండాకారపు మచ్చలు ఏర్పడుతాయి. నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రాములను లీటరు నీటిలో కలిపి ఆకుల అడుగు భాగం బాగా తడిచేట్లు పిచికారీ చేయాలి.


రోగం సోకిన చెరుకు పంట

సమస్య పరిష్కరించేవరకు ఆందోళన ఆగదు

– సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

నింద్ర: రైతుల సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన ఆగదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని పాదిరి గ్రామం హైవే వద్ద రైతులతో కలిసి ఆయన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైవే కోసం రైతులు తమ పొలాలను విక్రయించారని, ఆ సమయంలో సర్వీసు రోడ్డు తమ పొలాలకు, గ్రామాలకు వెళ్లడానికి ఏర్పాటు చేసేందుకు హైవే అధికారులు ఒప్పుకున్నారని తెలిపారు. అయితే నేడు చిత్తూరు–తచ్చూరు నేషనల్ హైవే పూర్తయినా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోగా.. రోడ్డుకు ఇరువైపులా ఫెన్సింగ్ వేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి రోడ్డుపైనే వంటావార్పు చేపట్టారు. సమస్యపై చిత్తూరు ఎంపీ, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడగా.. వారు మంగళవారం వచ్చి హైవేను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు నారాయణ తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, రైతు సంఘ జిల్లా ధ్యక్షులు జనార్దన్, జిల్లా కార్యదర్శులు నాగరాజు, మురళి, ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, చంద్రయ్య, రామదాసు, నగరి, పుత్తూరు నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


నాటి టీచర్లతో గ్రూప్ ఫొటో దిగుతున్న పూర్వ విద్యార్థులు

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లె ధర్మరాజుల ఆలయంలో ఆదివారం 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు భేటీ అయ్యారు. 24 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు నాటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారికి విద్య నేర్పిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఇక్కడ చదువుకుని వృత్తి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడి ఒకరికి ఒకరు సంబంధాలు లేకుండా ఉండవచ్చని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారి స్నేహ సంబంధాలు తిరిగి బలపడతాయన్నారు. తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు ఇలా ఉన్నత స్థాయిలో ఉండడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులు వాళ్ల గురువులను సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో శ్రీ బాలాజీ విద్యానికేతన్ స్కూల్ మాజీ కరస్పాండెంట్ బండి పట్టాభి రెడ్డి, అప్పటి టీచర్లు గిరిబాబు, వినోద్ కుమార్, గోపాల్ రెడ్డి, జానకిరామిరెడ్డి, పురుషోత్తం సుబ్రమణ్యం, దాము, యుగంధర్‌తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





అలరించిన సాంస్కృతిక ప్రదర్శన







కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలోని ఆస్థానమండపంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను మైమరిపించాయి. హరికథలు, గీతాలాపానలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు వినోదభరితంగా సాగాయి. కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కళాకారులు ఇచ్చే ప్రదర్శనలకు చూపరులు వేదికవైపే వాలిపోయారు. అనంతరం కళాకారులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.


వెంగళరాజుకుప్పంలో వేరుశనగలో కలుపు తీస్తున్న కూలీలు

రబీ సాగు.. రైతు బిజీబిజీ..


వరినాట్లు వేయడానికి ట్రాక్టర్‌లో దుక్కులు చేస్తున్న రైతన్న

పాలసముద్రం: మండలంలో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు రబీ సాగుకు శని, ఆదివారాల్లో రెండో విడతలో దుక్కులు చేసి, అండ తీసి వరి పంట వేస్తున్నారు. మండలంలో బోరుబావుల కింద ఉన్న రైతులు సుమారు 785 హెక్టార్ల భూమిలో వరి పంటలు, మరికొంతమంది రైతులు 356 హెక్టార్లు వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. రైతులు ఏ పంట సాగు చేసినా ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడం వల్ల భూములు మొద్దుబారి పోయి దిగుబడి తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో స్థానికంగా లభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని పంటకు ఉపయోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. అందువల్ల రైతులు చాలా వరకు వ్యవసాయ అధికారి సూచనలు పాటిస్తున్నారు.


శ్రీకావేరిరాజుపురం వరినాట్లు వేయడానికి అండ తీస్తున్న కూలీలు


వరి నాట్లు వేయడానికి కాడెద్దులతో చదును చేస్తున్న రైతు